క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరించిన శ్రీలత

విజయనగరం ఫోర్ట్: గాజులరేగ వ్యవసాయ పరిశోధన స్థానంలో ఉన్న ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విద్యాలయం ఏరువాక కేంద్రం (డాట్ సెంటర్) కో ఆర్డినేటర్‌గా (సమన్వయకర్త) డాక్టర్ శ్రీలత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం జిల్లా వ్యవసాయ (నైరా) కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేసి బదిలీపై ఆమె ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకు అందుబాటులో ఉంటూ వారికి అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తామని చెప్పారు. వివిధ పంటలకు ఆశించే తెగుళ్లు, చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు తెలియజేస్తామన్నారు. ఇంతవరకు ఇక్కడ కో ఆర్డినేటర్‌గా పనిచేసిన డాక్టర్ కెల్ల లక్ష్మణ్ సీనియర్ శాస్త్రవేత్తగా ఇక్కడే కొనసాగనున్నారు.

భోగాపురం పీఎస్ అప్‌గ్రేడ్..


సర్కిల్‌గా అప్‌గ్రేడ్ అయిన భోగాపురం పీఎస్

పూసపాటిరేగ: భోగాపురం పోలీస్‌స్టేషన్‌ను సర్కిల్‌గా అప్‌గ్రేడ్ చేయడంతో పోలీస్ సేవలు మరింత విరివిగా అందనున్నాయి. ఇంతవరకు భోగాపురం సర్కిల్ కార్యాలయంలో భోగాపురం, పూసపాటిరేగ, డెంకాడ, నెల్లిమర్ల పోలీస్ స్టేషన్లు ఉండేవి. భోగాపురం పోలీస్‌స్టేషన్ సర్కిల్‌గా అప్‌గ్రేడ్ చేయడంతో.. పూసపాటిరేగ, డెంకాడ, నెల్లిమర్ల పోలీస్‌స్టేషన్లను రూరల్ సర్కిల్‌గా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం భోగాపురం, భోగాపురం రూరల్ సర్కిళ్లకు ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. ఇంతవరకు ఒక సర్కిల్‌గా ఉన్న నాలుగు స్టేషన్లను విడదీసి రెండు సర్కిళ్లుగా ఏర్పాటు చేయడంతో నేరాల అదుపునకు వీలుంటుందని రూరల్ సీఐ వెంకటేశ్వరరావు అన్నారు.

అవగాహన ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారులు, సిబ్బంది

విజయనగరం రూరల్: ఈ నెల 3న నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని పురస్కరించుకుని రాకోడు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.శ్రావణి ఆధ్వర్యంలో రాకోడు గ్రామంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ బంగారు అఖిల, సీహెచ్ఓ మాణిక్యం, పీహెచ్ఎన్ రాముడమ్మ, ఆరోగ్య పర్యవేక్షకులు శ్రీరామ్మూర్తి, శ్రీనివాసరావు, కళావతి, ఆరోగ్య సహాయకులు చిన్నారావు, కృష్ణ, శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ సన్యాసిరావు, ఫార్మాసిస్టులు ఎల్టీ నాయుడు, ప్రసాద్, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్సై సన్యాసినాయుడు

పూసపాటిరేగ: మండలంలోని కందివలస, ఎల్పీ పాలెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఎస్సై ఎ. సన్యాసినాయుడు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లోని మౌలిక వసతులపై ఆరా తీశారు. ఆయనతో పాటు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

31లోగా ఆస్తిపన్ను చెల్లించాలి

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజలు 2023 – 24 ఆర్థిక సంవత్సరానికి గాను ఆస్తి పన్ను ఈ నెల 31లోగా చెల్లించాలని కార్పొరేషన్ కమిషనర్ ఎం. మల్లయ్యనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 మార్చి 31వ తేదీ లోపుగా ఆస్తి, ఖాళీ స్థలాల పన్నును ఒకేసారి లేదా వాయిదాలలో చెల్లిస్తేనే వడ్డీమాఫీ వర్తిస్తుందని పేర్కొన్నారు. గతంలో వడ్డీ చెల్లించి ఉంటే పన్నుల్లో సర్దుబాటు చేస్తామని స్పష్టం చేశారు. కావున ఆస్తిపన్నుదారులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఇందుకోసం కార్పొరేషన్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు.

పండగలా పింఛన్ల పంపిణీ

విజయనగరం రూరల్: మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో వైఎస్సార్ పింఛన్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం పండగలా నిర్వహించారు. ఆయా సచివాలయాల పరిధిలో 6,127 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా.. సాయంత్రానికి గ్రామ వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి 4,909 మంది లబ్ధిదారులకు నగదు అందజేశారు. పింఛన్ల పంపిణీలో విజయనగరం మండలం జిల్లాలో ఆరో స్థానంలో నిలిచిందని ఎంపీడీఓ గంటా వెంకటరావు తెలిపారు.

ఆధ్యాత్మిక శోభ..

- సంతోషిమాత ఆలయంలో పూజలు
- ఘనంగా సామూహిక కుంకుమార్చనలు


సామూహిక కుంకుమ పూజలలో భక్తులు


అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకుడు రమేష్ తివారి


భక్తులకు హారతి ఇస్తున్న అర్చకుడు

విజయనగరం జిల్లా కేంద్రంలోని సంతోషిమాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలతో పాటు సామూహిక కుంకుమార్చనలు చేపట్టారు. అర్చకుడు రమేష్‌తివారి వేకువజామున అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

విజయం మనదే..

- ఐదేళ్లలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని గడప గడపకు తీసుకువెళ్లాలి
- జగనన్నను మరోసారి సీఎంను చేద్దాం
- ఎంపీపీ మామిడి అప్పలనాయుడు


వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, నడిపేన శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మలిచర్లలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని గడప గడపకూ వివరించాలన్నారు. దేశంలోనే ఏ ముఖ్యమంత్రీ చేయనన్ని సంక్షేమ పథకాలు అమలు చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదల పక్షపాతిగా నిలిచారన్నారు. విద్య, వైద్య రంగాల్లో వినూత్న మార్పులు తీసుకువచ్చి భవిష్యత్ తరాలకు భరోసా కల్పించారని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను అవినీతిరహితంగా, పార్టీలకతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రజల గడప వద్దకే సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. వైఎస్సార్ పింఛను కానుక, విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు, అందరికీ ఇళ్లు పథకం, జగనన్న చేయూత, వైఎస్సార్ ఆసరా, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం, జగనన్న ఆరోగ్య సురక్ష, రైతుభరోసా, సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగిందని తెలిపారు. విజయనగరం ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఐదేళ్లలో నియోజకవర్గ అభివృద్ధి చేసిన కృషిని ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సన్నిబాబు, బంగారునాయుడు, అప్పన్న తాత, సుంకరి దుర్గరాజు, మండలంలోని పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి

- కార్పొరేషన్ కమిషనర్ మల్లయ్యనాయుడు

విజయనగరం: ఈ నెల 3వ తేదీన నగర వ్యాప్తంగా చేపట్టనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ విజయవంతం చేయాలని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదు సంవత్సరాల్లోపున్న చిన్నారులకు పోలియో చుక్కలు విధిగా వేయించాలన్నారు. పోలియో రహిత సమాజమే ధ్యేయంగా ప్రభుత్వం బృహత్తర కార్యక్రమాలను చేపడుతోందని చెప్పారు. నగరంలో నిర్దేశిత పోలియో కేంద్రాలతో పాటు మొబైల్ పోలియో కేంద్రాలను కూడా ఏర్పాటు చేశామన్నారు. అలాగే రైల్వే స్టేషన్, బస్ కాంప్లెక్స్, తదితర రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక బూత్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

దరఖాస్తుల ఆహ్వానం

భోగాపురం: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో వచ్చేనెల 21న నిర్వహించనున్న 6వ తరగతి ప్రవేశపరీక్షకు సంబంధించి ఈ నెల మూడో తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రిన్సిపాల్ పార్వతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఓసీ, బీసీ కులాలకు చెందిన విద్యార్థులు 2012 సెప్టెంబర్ 1, 2014 ఆగస్టు 31 మధ్య.. ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన విద్యార్థులు 2010 సెప్టెంబర్ 1, 2014 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలన్నారు. ప్రభుత్వం లేక ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలలో నిరవధికంగా 2022–23, 2023–24 విద్యా సంవత్సరాలు చదివి ఉండాలన్నారు. 2023–24 విద్యా సంవత్సరంలో 5వ తరగతి చదువుతూ ప్రమోషన్ పొంది ఉండాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు జిరాక్స్ కాపీలతో పాటు విద్యార్థి స్టడీ సర్టిఫికెట్, ఆధార్, రేషన్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలను పాఠశాలకు అందజేయాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి తీవ్ర గాయాలు

విజయనగరం క్రైమ్: ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో వృద్ధురాలికి తీవ్రగాయాలైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. రాకోడు గ్రామానికి చెందిన కె.చిన్నతల్లి అనే వృద్ధురాలు కొత్తపేట కుమ్మరివీధిలో నివాసం ఉంటోంది. మధ్యాహ్న సమయంలో రాకోడు వెళ్లేందుకు ఎత్తుబ్రిడ్జి వరకు వచ్చింది. రోడ్డు దాటుతుండగా అటుగా వస్తున్న విజయనగరం – ఎస్.కోట పల్లెవెలుగు బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు, ట్రాఫిక్ పోలీసులు ఆమెను కేంద్రాస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హరిబాబునాయుడు తెలిపారు.

బీజేపీ నాయకుల నిరసన

విజయనగరం టౌన్: పశ్చిమబెంగాల్‌లోని సందేశ్‌ఖలీలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, అకృత్యాలను నిరసిస్తూ బీజేపీ నాయకులు కోట జంక్షన్ నుంచి గంటస్తంభం వరకు గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు ఈశ్వరరావు, బవిరెడ్డి శివప్రసాదరెడ్డి, కుసుమంచి సుబ్బారావు, రెడ్డి పావని మాట్లాడుతూ.. మమతా బెనర్జీ ఓ మహిళ అయినప్పటికీ మహిళల ఆత్మగౌరవానికి భంగం కలుగుతుందంటే దోషులకు రక్షణ కవచంగా ఆమె నిలబడడం దారుణమన్నారు. కార్యక్రమంలో శంబర లక్ష్మీనరసింహ, గండకోట శాంతి, ఇమంది అమ్మాజీ, వీవీ రామరాజు, సుధీర్, కంది సీతారామ్, కొండల శ్రీనివాస్, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు

- కార్పొరేషన్ కమిషనర్ మల్లయ్యనాయుడు


పోలింగ్ కేంద్రాల వద్ద సదుపాయాలపై ఆరా తీస్తున్న కమిషనర్ మల్లయ్యనాయుడు

విజయనగరం: నగరంలో ఉన్న పోలింగ్ కేంద్రాలను విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎం. మల్లయ్యనాయుడు శుక్రవారం పరిశీలించారు. స్థానికంగా ఉన్న పోలింగ్ కేంద్రాలలో సదుపాయాలను క్షుణ్ణంగా గమనించారు. రాజీవ్‌నగర్ ప్రాథమిక పాఠశాల, సంగీత కళాశాల, మఠం వీధిలో ఉన్న శ్రమఫల పాఠశాలలో ఉన్న పోలింగ్ కేంద్రాలను సిబ్బందితో కలిసి పరిశీలించారు. ముఖ్యంగా ర్యాంపుల నిర్మాణం సరిగా ఉన్నాయా.. లేదా?, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు, నీటి సరఫరా, పరిసర ప్రాంతాల పరిశుభ్రత వంటి అంశాలను గమనించి లోటుపాట్లను సరిచేయాలని అక్కడున్న అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించే బాధ్యత కార్యదర్శులదేనన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగరంలో ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్నామన్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. భవన నిర్మాణ వ్యర్థాలు రహదారులపై ఉండకుండా చూడాలని కార్యదర్శులకు ఆదేశించారు.

పన్ను బకాయిలు చెల్లిస్తే వడ్డీ మాఫీ

- నగర పంచాయతీ కమిషనర్ బాలాజీప్రసాద్


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ బాలాజీప్రసాద్

నెల్లిమర్ల: నగర పంచాయతీకి చెందిన పన్ను బకాయిదారులు తమ బకాయిలు వెంటనే చెల్లిస్తే వన్‌టైమ్ సెటిల్మెంట్ కింద వడ్డీమాఫీ చేస్తామని ఇన్‌చార్జ్ కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సచివాలయాల కార్యదర్శులు, నగర పంచాయతీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత 2023 – 24 ఆర్థిక సంవత్సరంతో పాటు గతంలోనున్న ఇంటి, ఆస్తి పన్ను బకాయిలకు కూడా వడ్డీ రాయితీ వర్తిస్తుందన్నారు. నగర పంచాయతీకి చెందిన ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని, ఈ నెలాఖరులోగా పన్నులు చెల్లించాలని సూచించారు. అలాగే ఇప్పటికే పూర్తిస్థాయిలో చెల్లించిన పన్నుదారులకు వచ్చే ఏడాది పన్నులో మినహాయింపు ఉంటుందని తెలిపారు. సమావేశంలో మేనేజర్ టీపీఎస్ విశ్వేశ్వరరావు, ఆర్ఐ రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాల అందజేత

బొండపల్లి: అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి లబ్ధి చేకూర్చడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తూ ముందుకు వెళ్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బోడసింగి జగదీశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని బోడసింగిపేట గ్రామంలో జగనన్న లేఅవుట్లలోని ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు ప్రభుత్వం ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి అందించిన పట్టాలను 160 మందికి శుక్రవారం పంపిణీ చేశారు. ప్రభుత్వం లక్షలాది రుపాయలు విలువ చేసే ఇంటి స్థలాలను ఉచితంగా ఎటువంటి భారం లేకుండా రిజిస్ట్రేషను చేసి పట్టాలను అందించిందన్నారు. ఆర్.ఐ సతీష్, వీఆర్ఓ బి.రవి, వైఎస్సార్‌సీపీ నాయకులు మోహనరావు, అప్పారావు, రామునాయుడుతో పాటు లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే సీఎం జగన్ ధ్యేయం


వైద్యులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి

- వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి

భోగాపురం: ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని కవులవాడలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉప్పాడ మాట్లాడుతూ.. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో గ్రామస్వరాజ్యాన్ని సాధించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ పాలనలో విద్య, వైద్య రంగాలకు ఎనలేని ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డిని మరోమారు ఆశీర్వదించాలని కోరారు. వైద్యశిబిరంలో సుమారు 363 మంది వైద్య సేవలు పొందారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొండపు కొత్తయ్యరెడ్డి, దాట్ల శ్రీనివాసరాజు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ దాసరి బంగారయ్య, వైద్యులు తిరుపతిస్వామి, వి. లత, ఎం. చాణక్య, వి. శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించా..

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి


తాగునీటి కుళాయిని ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మారుమూల ప్రాంతాల్లో సైతం తాగునీటి సమస్యలను పరిష్కరించామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఇందులో భాగంగానే ఉప్పునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న ధర్మపురి ప్రాంత ప్రజలకు మున్సిపల్ కార్పొరేషన్ కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నామని చెప్పారు. నగరంలోని 30వ డివిజన్ ధర్మపురిలో నూతనంగా ఏర్పాటు చేసిన కుళాయి కనెక్షన్లను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శుక్రవారం ప్రారంభించారు. ధర్మపురి చేరుకున్న ఆయనకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ పతివాడ గణపతిరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కనకల కృష్ణ మాట్లాడుతూ.. ధర్మపురిలో ఎన్నో ఏళ్లుగా ప్రజలు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. సమస్య తెలుసుకున్న కోలగట్ల రూ. 20 కోట్లతో తాగునీటి ట్యాంక్ నిర్మించారని చెప్పారు. తాజాగా కుళాయి కనెక్షన్లను ప్రారంభించి ప్రజల దాహార్తిని తీర్చారన్నారు. మరోసారి ఆయనను శాసనసభ్యుడిగా గెలిపిస్తే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు పూసర్ల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు


రికవరీ చేసిన బంగారు ఆభరణాలను చూపిస్తున్న ఎస్సై రామగణేష్, సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామంలో ఇటీవల జరిగిన దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్సై రామగణేష్ మాట్లాడుతూ.. కొత్తపేట గ్రామానికి చెందిన ఓ బాలుడు ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడి చాలా డబ్బులు పోగొట్టుకున్నాడన్నారు. పోగొట్టుకున్న సొత్తును తిరిగి సంపాదించుకునేందుకు దొంగతనాలకు అలవాటు పడ్డాడని వివరించారు. ఇటీవల గ్రామంలో ఓ ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలు దొంగలించాడని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా బాలుడు నేరం చేసినట్లు తేలిందన్నారు. ఇంట్లో సొత్తును కూడా ఇదే విధంగా దొంగలించేవాడని తెలిపారు. నిందితుడ్ని కోర్టులో ప్రవేశపెట్టగా.. మైనర్ కావడంతో తల్లిదండ్రులకు అప్పగించారన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన తప్పనిసరి


సత్కారం పొందుతున్న జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ బ్రహ్మారెడ్డి

విజయనగరం అర్బన్: దేశ రాజ్యాంగం, చట్టాలపై యువతకు కళాశాల స్థాయి నుంచే అవగాహన పెరగాలని జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ బ్రహ్మారెడ్డి వెన్నపూస అన్నారు. స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1950 జనవరి 26న రాజ్యాంగాన్ని అమలుచేసిన తర్వాతే స్వతంత్ర భారతదేశం ప్రజాస్వామ్య దేశంగా ఎదిగిందని తెలిపారు. అనంతరం ముఖ్య అతిథిని నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ టీడీవీఏ నాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వివాదాలకు దూరంగా ఉండాలి

దత్తిరాజేరు: ఎన్నికల సమయంలో ప్రజలు వివాదాలకు దూరంగా ఉండాలని ఎస్ భూర్జవలస ఎస్ఐ లక్ష్మీప్రసన్నకుమార్ కోరారు. గురువారం రాత్రి కె.కృష్ణాపురంలో నిర్వహించిన గ్రామ సభలో గ్రామస్తులకు ఎన్నికల నిబంధనలను వివరించారు. ఎక్కువగా యువకులు వలనే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వరాదని అన్నారు. యువత చెడు వ్యసనాలకు గురికాకుండా చూడాలని సూచించారు.